www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 డిసెంబర్ 2024
5
తిరుపతి



10-19 తేదీల్లో వైకుంఠ ద్వారదర్శనాలు

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి ఆలయంలో అత్యంత ప్రాముఖ్యమైన వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వచ్చే ఏడాది జనవరి 10 నుండి 19వ తేది వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ విస్తత ఏర్పాట్లు చేస్తోంది. దర్శన టోకెన్లు/టికెట్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనాలకు అనుమతిస్తారు. టోకెన్లు లేని భక్తులను తిరుమలకు అనుమతిస్తారు కానీ దర్శనం చేసుకునే అవకాశం ఉండదు. చంటి బిడ్డలు, వద్ధులు, దివ్యాంగులు, రక్షణ శాఖ, ఎన్ఆర్ఐ మొదలైన విశేష దర్శనాలు ఈ పది రోజుల పాటు రద్దు చేశారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు పది రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు టిటిడి ప్రకటించింది.

ఆ అధికారి తీరే వేరు

ఎవరైనా ప్రశ్నిస్తే సస్పెండే
గూడూరు ఆర్‌టిసిలో వింత ధోరణి
10 రోజులుగా నిరసన హోరు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఆర్‌టిసిలో ఆ అధికారి తీరే వేరు. ఎవ్వరైనా ప్రశ్నిస్తే చాలు కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తారు. అంతేకాదు వారిపై ఏదో ఒక సాకు చూపి సస్పెండ్ చేసేస్తారు. తనకు అనుకూలురైతే ఏ తప్పు చేసినా పర్వాలేదు. అనుకూల యూనియన్లలో వారిని ఓ విధంగా, వ్యతిరేకంగా ఉండేవారిపై కక్షసాధింపు చర్యలు ఆ అధికారి వ్యవహారశైలిలో కనిపిస్తుందని యూనియన్ నేతలు మండిపడుతున్నారు. పనిలో ఏ చిన్న పొరబాటు దొర్లినా జీవోలను అడ్డం పెట్టుకుని రూల్స్‌కు వ్యతిరేకంగా కార్మికులను వేధించడం పరిపాటి. గూడూరు డిపోలో అన్యాయంగా సస్పెన్షన్‌కు గురైన ముగ్గురు ఉద్యోగులు తమకు న్యాయం చేయాలని రెండు వారాలుగా రోడ్డెక్కినా లెక్క చేయకపోడం గమనార్హం.

ఏపిఎస్ ఆర్‌టిసి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడంలో కీలకమైనది. ప్రయాణీకులతో మర్యాదగా నడుచుకోవాలని పదే పదే చెప్పే అధికారులు, తమ వద్ద పని చేసే కార్మికుల పట్ల వివక్ష చూపడం శోచనీయం. గూడూరు ఆర్‌టిసి డిపో మేనేజరు వ్యవహారశైలి పలు విమర్శలకు తావిస్తోంది. అయినవారికి ఆకుల్లో...కాని వారికి కంచాల్లో అనే చందంగా వ్యవహరిస్తున్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారిపై కక్షగట్టి విధినిర్వహణలో ఏ చిన్న పొరబాటు దొర్లినా ఏకంగా సస్పెండ్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. అందులో అధిక భాగంగా నిత్యం కార్మికుల సమస్యలపై పోరాడే ఏపిఎస్ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ (సిఐటియు అనుబంధం) సంఘానికి చెందిన వారినే టార్గెట్ చేయడం గమనార్హం. అందుకు ఇటీవల చోటు చేసుకున్న ఘటనలో నిదర్శనం.

గూడురు డిపోలో కె.సుబ్రమణ్యం కండక్టరుగా విధులు నిర్వహిస్తున్నాడు. విధినిర్వహణలో రూ.70 తనిఖీల్లో అదనంగా ఉండడంతో దాన్ని సాకుగా చూపి ఏకంగా సస్పెండ్ చేశారు. ఇలాంటి కేసుల్లో గతంలో ఎపుడూ సస్పెన్షన్ చేసిన దాఖలాలు లేవు. అదే డిపోలో ఎ.శీనయ్య డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నేషనల్ హైవేమీద నెల్లూరు నుంచి గూడురుకు వెళ్లే సమయంలో ఇద్దరు వ్యక్తులు తప్పతాగి బైక్‌పై వచ్చి బస్సు ముందుభాగాన్ని గుద్దుకున్నారు. ఈ ఘటనను సాకుగా చూపి డ్రైవర్‌ను సస్పెండ్ చేశారు. ఇలాంటి కేసులోనే మరో డ్రైవర్‌ను సస్పెండ్ చేయకపోగ, కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇదే డిపోలో సిహెచ్ రాము డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఒక గ్రామంలో రోడ్డు మధ్యలో విగ్రహం ఉన్న ప్రాంతంలో ఓ వ్యక్తి తాగి నిలబడి ఉన్నాడు. బస్సు టర్ను తీసుకుని ప్రయాణీకులను దింపిన తర్వాత చూస్తే మద్యం తాగిఉన్న వ్యక్తి కిందపడి ఉన్నాడు. డ్రైవరే దీన్ని గమనించి సుమారు 4 గంటల పాటు అక్కడే ఉండి 108 పిలిపించడంతో ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. స్థానికులు సైతం బస్సు డ్రైవర్‌ది ఏ తప్పు లేదని, ఆయన చూపిన మానవత్వంపై ప్రశంసలు కురిపిస్తే అధికారి మాత్రం ఆయన్ని సస్పెండ్ చేశారు. కారణం వీరంతా ఎస్‌డబ్ల్యుఎఫ్ సభ్యులు కావడమే. వాస్తవానికి సర్క్యులర్ 1/2019 ఆ కార్మికులకు వర్తింప చేయాలి. కానీ తనకు అనుకూలమైన వారికి అమలు చేస్తూ, ప్రశ్నించేవారిపై జీవోనెంబరు 70 అమలు చేస్తుండడం దారుణం.

గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట కొనసాగుతున్న దీక్షలు

కార్మికులపై కేసులు విషయంలో 1/2019 సర్క్యులర్ అమలు చేయాల్సి ఉన్నప్పటికి గూడురు డిపో మేనేజరు అక్రమంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ ఉద్యోగులను మాత్రమే సస్పెండ్ చేయడం గమనార్హం. గతంలో వాకాడ డిపోలో పని చేసే సమయంలోనూ ఈ అధికారి ఎస్‌డబ్ల్యుఎఫ్ సభ్యులపై ఇలాగే వ్యవహరించారని ఆ సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. అక్రమంగా సస్పెండ్‌కు గురైన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని గత 10 రోజులుగా ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగిస్తున్నా కనీసం స్పందించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఆర్‌టిసి ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని, అన్యాయంగా వ్యవహరిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి కార్మికులు కోరుతున్నారు.

వివక్షకు తావులేదు: ఆర్ఎం, తిరుపతి

ఏపిఎస్ఆర్టీసీ గూడూరు డిపోలో కార్మికులపై డిపో మేనేజర్ తీసుకున్న చర్యల్లో ఎలాంటి వివక్షకు తావు లేదు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకోవడం తప్పదు. దీనిని వేరే కోణంలో చూడకూడదు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. అదే సమయంలో తప్పులు జరిగితే చర్యలు తీసుకోవడం కూడా అధికారుల బాధ్యత. గూడూరు విషయాన్ని మరింత లోతుగా పరిశీలిస్తాం.

'రివర్ వ్యూ' రిసార్ట్ వద్ద 'హైటెన్షన్'

కూల్చివేతకు అధికారుల యత్నం
అడ్డుకున్న వైసీపీ శ్రేణులు
సేఫ్టీ వాల్ కూలదోత
మాజీ ఎంఎల్ఎలు ఆందోళన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలోని స్వర్ణముఖి నదీ ఒడ్డున నిర్మించిన 'రివర్ వ్యూ రిసార్ట్' కూల్చివేతకు శనివారం మున్సిపల్ అధికారులు యత్నించారు. దీంతో రిసార్ట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ రిసార్ట్ మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి కుమార్తెది కావడంతో ప్రతిఘటన ఎదురవుతుందనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా పోలీసులతోపాటు ప్రత్యేక బలగాలను మోహరించారు. రిసార్ట్ కూల్చివేత సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యేలు తాటిపర్తి చెంచురెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఘటనా స్థలికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్నారు. సేఫ్టీవాల్ కూల్చుతున్న జేసీబీని అడ్డుకున్నారు. దీంతో అక్కడ కాసేపు హైటెన్షన్ నెలకొంది. కూటమి ప్రభుత్వ పాలన మరీ ఇంత ఘోరమా..! కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా కట్టడాలు కూల్చేస్తారా..! అదే జరిగితే ఇక్కడే మా ప్రాణాలు తీసుకుంటామంటూ మాజీ ఎమ్మెల్యేలు చెంచురెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎదురుతిరిగారు. దీంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తలకు దారి తీశాయి. ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మీరెంత ప్రతిఘటించినా అనుమతుల్లేని రిసార్ట్ ను కూలదోయడం ఖాయమని తేల్చి చెప్పారు. బఫర్ జోన్ దాటి లోపలికి వచ్చిన కట్టడాల కూల్చివేతపై మీకే మూడు రోజుల సమయం ఇస్తున్నామని చెప్పారు. లేకుంటే తామే స్వయంగా వచ్చి కూలదోయడం ఖాయమని స్పష్టం చేసి అక్కడ నుంచి వెళ్లి పోయారు. రివర్ వ్యూ రిసార్ట్ ను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అప్రూవల్ లేకుండా నది బఫర్ జోన్ లో నిర్మించారన్నది అధికారుల వాదన. ఈ అంశాలనే కారణంగా చూపి కూల్చివేతకు పూనుకున్నారు.

'పసుపర్తి'లో సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

'గృహమే కదా స్వర్గసీమ' అన్నాడో మహాకవి. దానికి చిరునామాగా నిలుస్తోంది పసుపర్తి ఇన్‌ఫ్రా. మధ్య తరగతి ప్రజలు సొంతింటి కలను నెరవేర్చేందుకు అన్ని రకాల సదుపాయాలతో, సరసమైన ధరలతో సొంతింటిని సాకారం చేసుకునేందుకు పసుపర్తి ఇన్‌ఫ్రా నిత్యం కృషి చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. తిరుపతి-కరకంబాడి రోడ్డులోని ఆర్‌టివో కార్యాలయానికి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న పసుపర్తి సింఫోనీ లైఫ్ అట్ మెలోడీ వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

ప్రజల ప్రతి ఆసక్తిని, ప్రాధాన్యతను అందించడం, విశ్రాంతి కార్యకలాపాల హద్దుల్లేని రాజ్యాన్ని ప్రదర్శించడం అవసరం. మా అపార్టుమెంట్‌లో ఈ సౌకర్యాలు మెండుగా ఉంటాయి. క్రీడా సౌకర్యాలతో చురుకైన జీవనశైలిని ఆలింగనం చేసుకోండి. ఆరుబయట వినోదం కోసం విశాలమైన పచ్చిక బయళ్ళు, చైతన్యం నింపే స్ట్రోల్స్‌ను ఆహ్వానించే సుందరమైన వాకింగ్ ట్రాక్‌లు, ఇండోర్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం, టేబుల్ టెన్నిస్ నుండి బిలియర్డ్స్ వరకు వివిధ రకాల ఆటలలో మునిగి తేలడం, విశ్రాంతి ఆనందానికి అంతులేని అవకాశాలను అందించేలా కృషి చేస్తున్నాం. ప్రాపర్టీస్ నమ్మకం, కస్టమర్ సంతప్తి ఆధారంగా ఆశించదగిన ఖ్యాతిని పొందాయి. నమ్మశక్యం కాని నివాస స్థలాల నుండి కమర్షియల్ కాంప్లెక్స్‌ల వరకు, అసాధారణమైన నాణ్యతను అందించడానికి మా అంకితభావం అనేక మంది వినియోగదారుల విశ్వాసాన్ని పొందింది. ఇదే వినియోగదారుల సంఖ్యను పెంచుతోంది. హోలిసిటీ, రిలాక్స్, సంతోషించు, విశ్రాంతి పొందండి, ప్రశాంతత, విశ్రాంతి సారాంశాన్ని వినియోగదారులు అనుభవించాలని సూచించారు. అద్భుతమైన ల్యాండ్ స్కేపింగ్‌తో సజావుగా మిళితమై ఉన్న నిష్కళంకమైన ఆర్కిటెక్చర్ అద్భుతమైన ఫ్రంట్ వ్యూతో మంత్రముగ్ధులయ్యేలా సిద్ధం చేసుకోండి. గ్రాండ్ ఎంట్రన్స్ నుండి కళ్లకు విజువల్ ఫీస్ట్‌ను రూపొందించడం ద్వారా నిశితంగా రూపొందించబడిన ముఖభాగం వరకు, ప్రతి వివరాలు ఆనందాన్ని కలిగించడానికి, స్ఫూర్తినిచ్చేలా రూపొందించబడ్డాయి. సొంతింటి అభిరుచిగల ప్రతి ఒక్కరి అంచనాలకు తగ్గట్టుగా భవనాలు నిర్మిస్తున్నాం. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు 9030418099, 9885675056, 9849446486 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు...
- 24/7 సెక్యూరిటీ.
- గేటెడ్ కమ్యూనిటీ.
- 49 ఫ్లాట్స్.
- ప్రైమీమ్ క్వాలిటీ.
- ఇండోర్ డోర్ అమెనిటీస్
- లగ్జరీ స్విమ్మింగ్ పూల్
- ప్రీమియం స్పెసిఫికేషన్

ప్రాజెక్ట్ లక్షణాలు
- 100శాతం వాస్తు
- సురక్షిత గేటెడ్ కమ్యూనిటీ
- భూగర్భ విద్యుత్తు - పవర్ బ్యాకప్ ప్రొవిజన్
- ఎలక్ట్రిసిటీ పోల్స్ డిజైనర్
- సిసి కెమెరా సర్వైలెన్స్ సిస్టమ్
- అధునాతన భద్రతా వ్యవస్థ
- ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్లు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సోలార్ సెక్యూరిటీ సిస్టమ్
- రెయిన్వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్
- చెట్లతో కప్పబడిన అవెన్యూ ప్లాంటేషన్
- శుద్ధి చేసిన నీటి సరఫరా- ప్రెజర్ పంపులు
- 24 గంటలు అంతరాయం లేని నీటి సరఫరా
- ప్రతిప్లాట్‌కు వీడియో డోర్స్.
- సోలర్ పవర్ సిస్టమ్.

వరుస వరదలతో...
జలాశయాలు కళకళ

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

వరుస తుపానులతో తిరుపతి జిల్లా నిండుకుండలా తయారైంది. లోతట్టు ప్రాంతాలు, వేలాది ఎకరాలు నీటమునిగాయి. వందలాది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నగరాలు సైతం చెరువులను తలపించాయి. ఇప్పటి వరకు సరే, రాబోవు రోజుల్లో మరింత వర్షాలు వచ్చే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లా వాసులు భయాందోళనకు గురవుతున్నారు.

గత రెండు వారాల్లో రెండు తుపాన్లు తిరుపతి జిల్లాను అతలాకుతలం చేశాయి. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలు తీవ్రవాయుగుండాలుగా, ఆపై తుపానుగా మారి, తమిళనాడు తూర్పు ప్రాంతాల్లో తీరం దాటడంతో ఆ ప్రభావంతో తిరుపతి జిల్లాలో వర్షాలు అధికంగా నమోదయ్యాయి. ముఖ్యంగా తూర్పు మండలాల్లో వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. తిరుమల ఘాట్‌రోడ్డులలో కొండచరియలు విరిగపడ్డాయి. తిరుమలోని పాపవినాశనం, గోగర్భండ్యామ్, ఆకాశగంగ, కుమారదార, పసుపుదార రిజర్వాయర్లు పూర్తిగా నిండడంతో వాటి నుంచి నీటిని కిందకి విడుదల చేశారు. జిల్లాలోని ప్రధాన జలాశయాలైన అరణియార్ సామర్థ్యం 1.85 టిఎంసిలు కాగా ప్రస్తుతం 1.82.5 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో అధికంగా 4800 క్యూసెక్కులు వస్తుండడంతో 5600 క్యూసెక్కుల నీటిని గేట్లు ద్వారా విడుదల చేశారు. మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం 0.910 టిఎంసిలు. ప్రస్తుతం 0.242 టిఎంసిలు నిల్వ ఉంది. 600 ఇన్‌ఫ్లో వరద వస్తుంది. 600 క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. మల్లిమడుగు సామర్థ్యం 0.181 టిఎంసి, ప్రస్తుతం పూర్తిగా నిండడంతో 0.181 నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 2800 క్యూసెక్కులు వస్తుడడంతో 3500 క్యూసెక్కులు నీటిని బయటకి విడుదల చేస్తున్నారు. కాళంగి జలాశయానికి వరదనీరు పెరగడంతో 18 గేట్లలో, 12 గేట్లను పైకెత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. వరదల వల్ల దొరవారిసత్రం, తడ, పెల్లకూరు , వాకాడా, శ్రీకాళహస్తి మండలాల్లో ఇప్పటికే 20వేల ఎకరాలు వరిపైరు నీట మునిగింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా శుక్రవారం రాత్రికి జిల్లా వ్యాప్తంగా 3210 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. స్వర్ణముఖి నదిలో సైతం 2వేల క్యూసెక్కుల నీరు పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

అరణియార్ ప్రాజెక్టులో వరద నీరు దిగువకు

చెరువులను తలపించిన తిరుపతి నగరం

తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. తిరుపతి నగరంలో పలు ప్రాంతాలు, ప్రధాన రహదారులు సైతం చెరువులను తలపించాయి. లక్ష్మీపురం సర్కిల్, వెస్టు చర్చ్ అండర్‌బ్రిడ్జి రోడ్డు, డిఆర్‌మహల్, ఆర్‌సి రోడ్డు అండర్‌బ్రిడ్జిలు, ఎస్‌పిడిసిఎల్ క్రీడా ప్రాంగణం ముందు ఆరు అడుగుల మేర నీరు రోడ్డుపై నిలిచిపోయింది. డివైడర్లను పగలకొట్టి నీటిని కిందకి పంపారు. కపిలతీర్థం, మాల్వాడిగుండం పొంగి పొర్లుతుండడంతో ఆ నీటి ప్రవాహ దారుల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తిరుపతి నగరంలో 17 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, లోతట్టు ప్రాంత ప్రజలను అక్కడికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణాతో మరింత నష్టాలు

ప్రభుత్వాలు ఏవైనా, పాలకులు ఎవ్వరైనా ప్రకృతి సంపదను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. నదులు, ప్రధాన కాల్వలు, పొర్లు కట్టలను వదలడం లేదు. అక్రమ ఇసుక రవాణా కోసం నది పరివాహ ప్రాంతాలను ఇష్టారాజ్యంగా తవ్వేయడం, పలు చెరువులు, వాగులను ఆక్రమించడంతో వర్షపునీరు విధిలేని పరిస్థితుల్లో పల్లం ప్రాంతాలకు, నివాస ప్రాంతాల్లోకి చొచ్చుకొస్తుంది. పెళ్లకూరు మండలంలో దీని తీవ్రత ఎక్కువగా ఉంది. ఇప్పటికైన అధికారులు స్పందించి అక్రమాలను అరికట్టి, ప్రకృతి సంపదను కాపాడి, విపత్తుల వల్ల ప్రజలకు ఇబ్బంది కల్గకుండా, ప్రకృతి కోపానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం
అన్నదాతల హడావి 'ఢీ'

పిచ్చాటూరులో..

మంతనాలతో 'అధికార' కూటమి ఏకగ్రీవం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో 610 నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం ఏడు గంటలకు ముగిసాయి. 3,600 మంది ఎన్నికల సిబ్బంది ఈ ఎన్నికలు సజావుగా జరిగేలా చూశారు. సాయంత్రం 5 గంటల వరకూ 610 నీటి వినియోగదారుల సంఘాలకు గాను 406 ఫలితాలను వెల్లడించారు. 3,690 టీసీలు (టెర్రిటరీ కాన్స్టిట్యూన్సీ)లకు 2,831 ప్రకటించారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిందని సూపరింటెండెంట్ ఇంజినీర్, తెలుగుగంగ ప్రాజెక్టు మదన్‌గోపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా వివరాలిలా ఉన్నాయి.

- యర్రావారిపాలెంలో మూడు ప్రధాన చెరువులైన సిద్దలగండి, నల్లసముద్రం, రెడ్డి చెరువులకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహశీల్దార్ పరమేశ్వర స్వామి తెలిపారు. సిద్దలగండి చెరువు ఛైర్మన్‌గా టి.వెంకటరమణ, వైస్‌ఛైర్మన్‌గా నాగభూషణం, నెరబైలు పంచాయతీలోని నల్లసముద్రం ఛైర్మన్‌గా సుబ్రమణ్యం, వైస్‌ఛైర్మన్‌గా మనోహర్, అయ్యప్పరెడ్డి చెరువు ఛైర్మన్‌గా ఎం.శంకర్, వైస్‌ఛైర్మన్‌గా సుజాత ఏకగ్రీవమైనట్లు ఎఇ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

- పిచ్చాటూరులో అరణియార్ ప్రాజెక్టు నీటిపారుదల ఎన్నికలో ఛైర్మన్‌గా వైస్ రవి, వైస్‌ఛైర్మన్‌గా గోవర్ధన్‌నాయుడు ఎన్నికయ్యారు. వీరిని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం అభినందించారు. అడవి శంకరాపురం ఛైర్మన్‌గా దొమ్మరాజు పద్మనాభంరాజు ఎన్నికయ్యారు.
- రామచంద్రాపురంలో 12 చెరువులకు 72 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తహశీల్దార్ కె.వెంకటరమణ, ఎంపిడిఒ ఇందిర, ఇరిగేషన్ ఎఇ యతిరాజులు వెల్లడించారు. అనుపల్లి చెరువుకు అధ్యక్షుడు పచ్చార్ల జగదీష్, పిల్లారికోన చెరువుకు అధ్యక్షులు దొంగర కష్ణయ్య, సంకట ముద్దలకోన చెరువు అధ్యక్షుడు కుప్ప స్వామి నాయుడు, తీట్రకోన చెరువు అధ్యక్షులు నాదముని రెడ్డి, అమ్మగారి చెరువు అధ్యక్షులు పులిపాటి మధుసూదన్, రాయల చెరువు కే అర్జున్ నాయుడు, పులిట్ల వాగు చెరువు అధ్యక్షులు తులసి బాబు నాయుడు, కోడి చెరువు అధ్యక్షురాలుగా లెక్కల మల్లేశ్వరమ్మ, కుప్పం బాదురు చెరువు అధ్యక్షుడు వై దొరస్వామి నాయుడు, అన్నా స్వామి గంట చెరువు అధ్యక్షుడు డి శ్రీనివాసులు రెడ్డి, బొప్పరాజు పల్లి చెరువు అధ్యక్షుడు జే హనుమంతయ్య యాదవ్, గుండాల వంక చెరువు అధ్యక్షుడు నరసింహారెడ్డిలకు నియామక పత్రాలను అందజేశారు.
- వరదయ్యపాలెంలో కొన్నిప్రాంతాల్లో చిన్న చిన్న సమస్యలు ఏర్పడినా ప్రశాంతంగానే ముగిసాయి. అంబురు సంబంధించి ఆణిమత్యం ముని చంద్రారెడ్డి ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.
- ఏర్పేడులో జంగాలపల్లి ఆయకట్టు నీటిపారుదల సంఘం అధ్యక్షునిగా నైనారు బాలాజీరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల టిడిపి అధ్యక్షులు నైనారు పొన్నారావు పాల్గొన్నారు. ఏర్పేడు అధ్యక్షులుగా బొడుగు గురవయ్యనాయుడు ఏకగ్రీవమయ్యారు.
- బిఎన్ కండ్రిగలో ఎనిమిది సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. మూడు సంఘాలకు వాయిదా పడ్డాయి. నెలవాయి, కల్లిపెట్టు, పార్లపల్లి, కాటూరు, కనమనంబేడు, కొత్తపాళెం, కారణి, కంచనపుత్తూరు, అలత్తూరు ఏకగ్రీవం అయ్యాయి. పల్లమాల సంఘానికి టీడీపీ, వైసీపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నిర్వాకోట టీసీ పరిధిలో సత్యనారాయణ వేసిన నామినేషన్‌ను ప్రత్యర్థి అభ్యర్థిదారులు చించివేయడంతో వాయిదా వేశారు. కరకుబట్టులో రెండు వర్గాలకు చెందిన మ నెయ్య, చంద్రయ్యలు ఇద్దరు చెరో ఆరు మంది సభ్యులను తీసుకుని నామినేషన్ వేయాలని ప్రయత్నాలు చేస్తున్న సందర్భంలో ఎన్నికల అధికారులు రాజీ చేసుకుని ఆరు మంది రావాలని తెలపడంతో నామినేషన్ వేసే సమయం మించిపోవడంతో ఈ ఎన్నికను ఎన్నిక అధికారి వాయిదా వేశారు. జంబుగోళం సాగు నీటి టీసీ ఎన్నికను వాయిదా వేశారు.
- గూడూరులో మర్రిపల్లి మడుగు సాగునీటి సంఘం ఎన్నికల్లో అధ్యక్షులుగా షేక్ చాన్‌బాష, ఉపాధ్యక్షులుగా జోగి శివకుమార్ ఎన్నికయ్యారు. చెన్నూరు అధ్యక్షులుగా యారమాపు హేమకుమార్‌రెడ్డి ఎన్నాకయ్యారు.
- సత్యవేడులో రాజగోపాలపురాన్ని జనసేనకు కేటాయించారు. మిగిలిన సంఘాలన్నీ టిడిపి మద్దతుదారులే ఏకగ్రీవమయ్యాయని ఇరిగేషన్ డిఇ సుబ్బరత్నారెడ్డి, ఎఇ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 13 చెరువులకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. సిఐ మురళినాయుడు సూచన మేరకు ఎస్ఐ రామస్వామి బందోబస్తు నిర్వహించారు. దళవాయి అగ్రహారం చెరువుకు ప్రదీప్‌కుమార్, పుదుకుప్పం చెరువుకు వినాయకమ్, ఆంబాకంకు శివానందం, మదనంజేరి చెరువుకు పళణి, సిరణంబూదూరు పెద్ద చెరువుకు అల్లాస్వామి, చిన్న చెరువుకు చంద్రశేఖర్ తదితరులు ఎన్నికయ్యారు. పెద్దపాండూరు చెరువు ఆయకట్టుకు ఓటరు జాబితా లేకనే ఎన్నికలు నిర్వహించారన్న విమర్శలు వచ్చాయి. యానాదివేట్టు పంచాయతీకి పారుదల ఉన్నప్పటికీ ఓటర్లు జాబితాలో లేవు.
- పుత్తూరు రూరల్ పరిధిలో గూళూరు చెరువు ఆయకట్టు ఛైర్మన్‌గా ఎస్.వెంకట్రాయులును ఎన్నుకున్నారు. ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ అభినందించారు.
- నాయుడుపేటలో 27 సంఘాలకు ప్రశాంతంగా ఎన్నిక జరిగినట్లు ఎఇఇ శ్రీనివాసరావు తెలిపారు.
- కోట మండలంలో మధ్యాహ్నం వరకూ ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికలు, సాయంత్రానికల్లా ఏకగ్రీవమయ్యాయి. 20 చెరువులకు పోటాపోటీగా సాగాయి. 19 చెరువులకు అధ్యక్షులుగా కూటమి ప్రభుత్వం దక్కించుకుంది. అల్లంపాడులో వైసిపి తరపు అబ్యర్థి ఏకగ్రీవమయ్యారు. మద్దాలి గ్రామంలో పచ్చాచంగమనాయుడు, కర్లపూడిలో అధ్యక్షులుగా పేర్నాటి ఆనందరెడ్డి, ఉత్తమ నెల్లూరు గ్రామంలో జంగిటి.వెంకట కష్ణయ్య, చిట్టేడు గ్రామంలో అధ్యక్షులుగా చంద్రగిరి కష్ణయ్య తదితరులు ఏకగ్రీవమయ్యారు.

ఎస్వీ జూ పార్కు ఫీల్డ్ ఇంజినీర్ సస్పెన్షన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాల ఫీల్డ్ ఇంజనీర్ పి రవి చనిపోయిన లావాదేవీకి సంబంధించి రేంజర్ మాధవి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఆరోపణల నేపథ్యంలో జూ ఉన్నతాధికారులు సస్పెన్షన్ విధించారు. ఈ మేరకు రేంజర్ మాధవి ఎంఆర్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్వీ జూ పార్కు నిర్వహణలో నిధుల వినియోగంలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో మరింత లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లుగా సమాచారం.

సీఎం దృష్టికి మరోసారి ప్రవీణ్ పేరు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకాన్ని త్వరలో ప్రకటించనున్న నేపథ్యంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పదవికి మరోసారి సత్రవాడ ప్రవీణ్ పేరును మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. శనివారం ఆయన ప్రవీణ్ ను తీసుకుని చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంశాన్ని గుర్తు చేశారు. మంత్రి లోకేష్ కూడా ఛైర్మన్ అంశంపై వివరించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం వెలకట్టలేనిది: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాముల త్యాగాన్ని వెలకట్టలేమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ వి వీరయ్య పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శనివారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ వి వీరయ్య మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మూలకారణం పొట్టి శ్రీరాములు 57 రోజుల ఆమరణ నిరాహార దీక్ష అన్నారు. గాంధీజీ ప్రియ శిష్యుడైన పొట్టి శ్రీరాములు సత్యం, అహింస, హరిజనోద్ధరణ మొదలైన సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా పాటించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యార్థినివిద్యార్థులకు 'పొట్టి శ్రీరాములు జీవితం– సందేశం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సమావేశంలో డాక్టరు మన్యం నరసింహులు, డాక్టరు పి సుజనా, డాక్టరు సావిత్రి, డాక్టరు పి గాయత్రి, డాక్టరు యం. శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రాకేష్ జన్మదినం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా విభాగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని జగనన్న అడుగుజాడల్లో నడుస్తున్న తిరుపతి జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ వేలూరు రాకేష్ పుట్టిన రోజు వేడుకలు స్థానిక వైసిపి కార్యాలయంలో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం తిరుపతి జిల్లా వైసిపి కార్యదర్శి మండి సాయికుమార్ ఆధ్వర్యంలో రాకేష్ పుట్టినరోజు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం వైసిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్ మాట్లాడుతూ రాకేష్ లాంటి నాయకుడు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, రాజకీయాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గురవయ్య, సిద్దేశ్వర్, వెంకటేష్, హేమంత్, కిరణ్, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ లీడర్లు పాల్గొన్నారు.

'దళితుల అభ్యున్నతికి నాగయ్య కృషి ఎనలేనిది'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దళితుల అభ్యున్నతి కోసం కదిరి మంగళం నాగయ్య ఎనలేని కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చెంగల్రాయలు పేర్కొన్నారు. తిరుపతి అంబేద్కర్ భవన్లో ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కే నాగయ్య వర్ధంతి సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెంగల్రాయలు మాట్లాడుతూ ఏపీలో దళితుల అభివృద్ధి కోసం నాగయ్య అనేక పోరాటాలు చేశారని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘాన్ని స్థాపించి, పలు రంగాలలో దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఎం నాగరాజా, గోవింద, ఎం ధనుంజయులు, పి వెంకటమునీ, రెడ్డప్ప, కురకల్లు మురళి, కృష్ణయ్య, ఇంద్ర ముని పాల్గొన్నారు.

వైసిపిపై నిందారోపణలు తగదు: వాసుయాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసిపి అధికారంలో ఉన్నప్పుడు తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానికులకు మంజూరు చేసే టిక్కెట్లు ఎంతో పారదర్శకంగా అందించామని, స్థానికుల వేలిముద్రలు తీసుకుని టికెట్లో మంజూరు చేస్తే అందులో అవినీతి జరిగిందని అవగాహన లేని వారు వైసిపిపై నిందారోపణలు చేయడం విడ్డూరంగా ఉందని తిరుపతి టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ వాసు యాదవ్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనసేన నాయకుడు వాస్తవాలు తెలుసుకోకుండా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, వీటిని సహించబోమని హెచ్చరించారు. వైసిపి హయాంలో 10 సెంటర్లు ఏర్పాటుచేసి 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వారా దర్శనం టికెట్లను 15 వేల మందికి మంజూరు చేశామని గుర్తు చేశారు. గతంలో ప్రస్తుతం జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్ఛార్జిగా వ్యవహరిస్తున్న వ్యక్తి శ్రీవారి టికెట్లు అమ్ముకోలేదా?' అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పసుపులేటి సురేష్, అమరనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, ముని పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెడనూరు సురేష్ రెడ్డి దంపతుల సహాయ సహకారాలతో నిర్విరామంగా మూడు సంవత్సరాల పూర్తి చేసుకొని నాలుగో సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ఆ వృద్ధులకు సేవ చేసే అవకాశం మరింత కలగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ప్రగతి సేవ సంస్థ ఉపాధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి, ట్రెజరరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు పిడి కరిముల్లా శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు టీచర్ రాదయ్య , కె ఆర్ ఎం, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్ కుమార్ నాయుడు, పిల్లిలి శ్రీనివాసులు,కోటా వెంకటేశ్వర్లు, డిష్ నాగరాజు ,తూపిలి యశ్వంత్, కృష్ణారెడ్డి , డీన్ శ్రీహరి, సంచి ముని ప్రసాద్, వాకాటి శ్రీనివాసులు నాగేంద్ర సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎనర్జీ కన్సర్వేషన్ డే

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్కూల్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎనర్జీ కన్సర్వేషన్ డే–2కే24 ను ఈఈఈ విభాగం, డిఆర్ఈఈఎంఎస్ సంస్థలు సంయుక్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఇంజనీర్ కే రంగనాధం, ఎం దేవేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎనర్జీ కన్సర్వేషన్ ప్రాముఖ్యత, ఎనర్జీ ఎఫిసీఎంసీ, ఎనర్జీ కన్సర్వేషన్ మధ్య తేడా ను వివరించారు. నేషనల్ ఎనర్జీ కన్సర్వేషన్ డే–2కె24 థీమ్ గురించి విద్యార్థినులకు వివరించారు. ఎనర్జీని ఆదా చేయడం వల్ల భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరులను అందించిన వారమవుతామని అది ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ డైరెక్టర్ పి మల్లికార్జున, ఆచార్య వీసి. వీరారెడ్డి , కో ఆర్డినేటర్ డి హిమబిందు, ఈఈఈ డిపార్ట్మెంట్ అధ్యాపకులు, విద్యార్థిను లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

క్యాన్సర్ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: క్యాన్సర్ పట్ల అప్రమత్తత అవసరమని టాటా క్యాన్సర్ ఆసుపత్రి ఎండి డాక్టర్ పెనుమడు ప్రశాంత్ తెలిపారు. తిరుపతి కరకంబాడి రోడ్డులోని వినాయకసాగర్లో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస, వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి టాటా క్యాన్సర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ క్యాన్సర్ నిపుణులు డా. పెనుమడు ప్రశాంత్ విచ్చేసారు. ఈ సందర్భంగా డా. ప్రశాంత్ మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, చిన్న చిన్న సమస్యలే రేపు క్యాన్సర్ గా మారే అవకాశం ఉందని తెలిపారు. ప్రతిరోజు శాఖాహారం తీసుకుంటూ నడక, వ్యాయామం, యోగ చేస్తే క్యాన్సర్ రాకుండా అడ్డుకట్ట వేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి శ్రీనివాస అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, ఉపాధ్యక్షులు ఆకుల వెంకటరమణమూర్తి వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలాజీ నాయిడు, కార్యదర్శి శివారెడ్డి పాల్గొన్నారు.

విదేశాల్లోనూ ఉన్నత స్థానం

ప్రజాశక్తి - రేణిగుంట: 2022 ఆగస్టు నెలలో నానో ఉపగ్రహాన్ని తయారుచేసి ప్రపంచ రికార్డును దక్కించుకున్న రేణిగుంట విద్యార్థి సాయిహేమంత్ కుమార్, 2023వ సంవత్సరంలో చెన్నైలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసించి లండన్లోని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్ నందు మాస్టర్స్ డిగ్రీ కొరకు విదేశీ విద్యకు వెళ్ళాడు. అక్కడ కూడా తనదైన ప్రతిభ చూపి యూనివర్సిటీలో మెకానికల్ బ్రాంచ్ లో టాపర్గా సాయిహేమంత్ కుమార్ వెన్నెలకంటి నిలిచాడు. దీనికి సంబంధించి యూనివర్సిటీ కులపతి సాయిహేమంత్ కుమార్ వెన్నెల కంటిని అభినందించారు. నగదు బహుమానాన్ని ప్రకటించారు.

విభాగ అధ్యక్షుడిగా ఆచార్య చింతపూడి చెంగయ్య తొలగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : రాజభవన్ ఆదేశాలతో విభాగ అధ్యక్షుడిగా ఆచార్య చింతపూడి చెంగయ్యను తొలగించారు. గత బుధవారం వర్సిటీలోని ఉపకులపతి, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ సభ్యులుగా కలిగిన హై పవర్ కమిటీ సమావేశమై అతనిపై ఉన్న మహిళా వేధింపు కేసు, మత ప్రచార ఆరోపణ కేసుపై నియమించిన రెండు కమిటీల నివేదికపై చర్చించి ఈ చర్య తీసుకున్నారు. ముఖ్యంగా ఆచార్య ఉషారెడ్డి ఫిర్యాదు మేరకు వేసిన కమిటీ మహిళను వేధించినట్లు ఆధారాలతో సహా నిరూపణ అయిందని కమిటీ నిర్ధారించింది. వర్సిటీ క్యాంపస్ లోని తరగతి గదులలో వారం క్రితం జరిగిన 'మత ప్రచారం – అధ్యాపకుడుపై దాడి' ఘటనపై నియమించిన ఫ్యాక్ట్ ఫైండ్ కమిటీ రిపోర్టర్ను పరిగణలోకి తీసుకుని విభాగ అధ్యక్షుడిగా తప్పించి, ప్రస్తుతానికి విభాగ అధ్యక్ష బాధ్యతలు తాత్కాలిక కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి శ్రీనివాసులుకి అప్పగించారు. చెంగయ్యను ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇవ్వాలని వర్సిటీ ఉన్నతాధికారులు గట్టిగా ఆదేశించారు. వర్సిటీ ఈ తొలగింపు, నియామక వ్యవహారాన్ని మొత్తం రాజభవన్కూ, రాష్ట్ర ప్రభుత్వానికి, కాలేజియేట్ ఎడ్యుకేషన్కి, హయ్యర్ ఎడ్యుకేషన్కి నివేదించింది. తరగతి గదిలలో మత ప్రచారం, మహిళ అధ్యాపకురాలపై వేధింపులు వంటివి వర్సిటీకి పూర్తి స్థాయిలో ఉన్నతాధికారుల పరిపాలనపై మాయని మచ్చగా పడింది. ఇవే కాకుండా మేనేజ్మెంట్ స్టడీస్ కళాశాలలో, కళాశాలలో మరికొందరు అధ్యాపకులపై కూడా వివిధ రకాల స్థాయిల్లో కమిటీలు వేశారు. ఈ కమిటీలకు సదరు అధ్యాపకులు సక్రమంగా హాజరుకాకుండా సెలవుపై కొనసాగుతున్నట్లు వర్సిటీలో ప్రచారం సాగుతోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అలాంటి అవినీతి, అక్రమ, వేధింపులకు గురిచేస్తున్న ఆచార్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి: ఎమ్మెల్యే



విద్యార్థినులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే సునీల్కుమార్ పేర్కొన్నారు. పాతపాటి సుబ్రహ్మణ్యం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ ప్రొజెక్టర్ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శనివారం ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే లక్ష రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. ముందు సరస్వతి విగ్రహానికి పూజలు నిర్వహించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారు లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్రహ్మాబ్రహ్మణ్యం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వారి కుటుంబ సభ్యులు శ్రీకంటి రామ్మోహన్ రావు పాఠశాలలో ఆధునిక ప్రొజెక్టరును ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. పాఠశాలకు తన వంతుగా లక్ష రూపాయలు ఆర్థిక సాయం అంది స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి, పురుషోత్తం, బిల్లు చెంచురామయ్య , సనత్ కుమార్ రెడ్డి, ఎస్ఎల్ ఎన్బాబు, పాదర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం: జడ్జి

పుత్తూరులో వివాదాలను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాజీయే రాజ మార్గమని లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బును ఆదా చేసుకోవచ్చని గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. పలుకేసుల్లో కక్షిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడవ అదనపు జిల్లా జడ్జి పర్వీన్ సుల్తానా బేగం మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలతో కేసులతో సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరగడం వల్ల డబ్బు, సమయం వృథా అవుతుందని లోక్ అదాలత్తో పరిష్కరించుకుని రాజీ చేసుకోవడం వల్ల ఇరువురూ మనశ్శాంతిగా జీవించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో సబ్ జడ్జిలు జయలక్ష్మి, లోకనాథం , లాయర్లు, పలు బ్యాంకుల అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అదాలత్లో 685 కేసులు పరిష్కరించామని న్యాయమూర్తి ఎస్ అనిల్ కుమార్ తెలిపారు. అందులో ఎస్టి, ఎస్సి కేసులు 66, క్రిమినల్ కేసులు 32, ఎక్సైజ్ కేసులు 25, సివిల్ కేసులు 4, బ్యాంక్ కేసులు 7, బిఎస్ఎన్ఎల్ కేసులు 11 పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కక్షిదారులు లోకదలత్ సద్వినియోగం చేసుకొని ఇద్దరూ గెలిచి సంతోష జీవితం సాగించాలని కోరారు. క్షణిక ఆవేశంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల జీవితాల వల్ల మానవ సంబంధాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని ఎవరూ కేసుల జోలికి పోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులందరూ కలసి మెలసి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుబ్బారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకృతికుమార్, సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ శ్రీరాములు యాదవ్, లోకదాలత్ సభ్యులు కె ధర్మ ప్రసాద్ న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్లో 337 కేసులకు పరిష్కారం లభించింది. రూ. 82.63 లక్షల సొమ్మును ఆదా చేశారు. లోక్ ఆదాలత్ తీర్పు సుప్రీం తీర్పుతో సమానమని అదాలత్లో పరిష్కారమైన సమస్యపై తిరిగి అప్పీలు చేసుకునే అవకాశం లేదని 12వ జిల్లా అదనపు జడ్జి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, అపీల్ లేదని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ పుత్తూరు కోర్టు ఆవరణలో శనివారం కక్షి దారులతో సమావేశం నిర్వహించారు. మూడు కోర్టులో బెంచులు ఈ సందర్భంగా పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి మండలి న్యాయ అధికారి సంస్థ అధ్యక్షుడు సి ఎస్ రాఘవేంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్ అంటే ప్రజల కోర్టు అని, మన తీర్పును మనమే తీర్చుకుంటామని ఇరు వర్గాల అంగీకారంతోనే తీర్పు ఇస్తారన్నారు. సమయం వృథా చేసుకోకుండా పరస్పరం అంగీకరించి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అనంతరం ఇద్దరు జంటలు కోర్టులో కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరిని కలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కే పురుషోత్తం, మాజీ అధ్యక్షులు ఎం సంజీవి, కే మురుగేషన్ రెడ్డి, కె రాజేష్, దీపిక, భాస్కర్, కక్షిదారులు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

టిటిడి సొంత డెయిరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

- బిసి సంఘం నాయకులు శ్రీనివాసులు యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి సొంతంగా డెయిరీ ఏర్పాటు చేస్తే తాను వెయ్యి ఆవులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని పుంగనూరుకు చెందిన బిసివై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ ప్రకటించారని, ఈ మేరకు టీటీడీ ధర్మకర్తల మండలి డైయిరీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలని బీసీ సంఘం నాయకులు శ్రీనివాసులు యాదవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంతో యావత్తు శ్రీవారి భక్తులు మనోవేదనకు గురయ్యారని, ఇలాంటివి పునరావృతం కాకుండా టిటిడి సొంత డెయిరీ దాతల సహకారంతో ఏర్పాటు చేసుకుంటే కల్తీ అంశాలు సమస్య సమసిపోయే అవకాశం వుందన్నారు. టిటిడి డెయిరీ ఏర్పాటు చేస్తే వెయ్యి ఆవులను ఇస్తానని, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో డైయిరీలు ఏర్పాటు చేస్తే లక్ష ఆవులు సమకూర్చడానికి, దీంతో పాటు స్థల సమీకరణకు సహకరిస్తానని ప్రకటించారన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు లేఖలు ఇచ్చారన్నారు. రామచంద్ర యాదవ్ పుంగునూరులో టిటిడి డైయిరీ ఏర్పాటు చేస్తే తనకున్న 22 ఎకరాల మామిడి తోటను రాసిస్తానని ప్రకటించారని టిటిడి ఇప్పటి వరకూ ఏ నిర్ణయం తీసుకోలేదని, వెంటనే ప్రారంభించాలని కోరారు. డెయిరీ ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రమణ యాదవ్ మాట్లాడుతూ యాదవులకు తిరుమల శ్రీవారికి ఘన చరిత్ర ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఈశ్వర్, మోహన్, గోపిరెడ్డి, రెడ్డి ప్రసన్న, విక్రమ్ పాల్గొన్నారు.

పోస్టర్ను ప్రదర్శిస్తున్న బిసి సంఘం నాయకులు శ్రీనివాసులు యాదవ్

ఎడ్యుకేషన్ ఫెయిర్ను సద్వినియోగం చేసుకోవాలి: నందకిషోర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని కపిల తీర్థం వద్దగల రాజ్ పార్క్ హోటల్ వేదికగా ఫౌండేషన్ ఫర్ యూత్ అడ్వాన్స్మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం, సోమవారం నిర్వహించనున్న ఎడ్యుకేషన్ ఫెయిర్ను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ ఉపాధ్యక్షులు తూపల్లి నందకిషోర్ సూచించారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రముఖ విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ మెడికల్ కోర్సులు అందించే కళాశాలలు ఒకే వేదికపైకి తీసుకొచ్చి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేయడానికి ఈ ఫెయిర్ దోహదపడుతుందన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ ను సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఎడ్యుకేషన్ ఫెయిర్లో ఆయా వర్సిటీలకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉంటారని వారి ద్వారా కోర్సుల వివరాలు, ఫీజులు, స్కాలర్షిప్ వంటివి విద్యార్థులు వారితో మాట్లాడి నేరుగా తెలుసు కోవచ్చన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎడిఫై విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్, విద్యార్థి సంఘాల నాయకులు హాజరవు తారన్నారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లు వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నందకిషోర్

క్రైం న్యూస్

ప్రమాదవశాత్తు జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రమాదవశాత్తు జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన గూడూరు రైల్వే స్టేషన్లో శనివారం చోటు చేసుకుంది. గూడూరు రైల్వే పోలీసుల కథనం మేరకు ఒడిస్సాకు చెందిన సబిత ఆచార్య (52) ఒడిస్సా నుండి బెంగళూరుకు దురంతో ఎక్స్ప్రెస్లో వెళుతుండగా గూడూరు రైల్వే జంక్షన్లో రైలు ఆగిందని, ఆమె దిగి ఎక్కే క్రమంలో జారిపడి మృతి చెందిందన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం పాలైన దుర్ఘటన శనివారం వీసీపల్లి సమీపంలోని మదనపల్లి నాయుడుపేట జాతీయ రహదారి వంతెన పై చోటు చేసుకుంది. టూ టౌన్ సిఐ వెంకటేశులు కథనం మేరకు నెల్లూరులోని జలదంకి ప్రాంతానికి చెందిన స్నేహితులు వినయ్ కుమార్, హేమలతలు ద్విచక్రవాహనంలో తిరుమల వెళ్ళి దర్శనాంతరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీసీపల్లి వద్ద ముందు వెళుతున్న లారీని అధిగమించబోయారు. ఈ క్రమంలో హేమలత(22) హ్యాండ్ బ్యాగ్ లారీకి చిక్కుకుంది. ఆమె అదే లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. వినయ్ కుమార్కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన సేవలు అందించండి: ఏపీ ఈఆర్సి ఛైర్మన్

ప్రజాశక్తి -రామచంద్రాపురం: వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ ఠాకూర్ రామ్సింగ్ అన్నారు. మండలంలోని కుప్పం బాదూరులోని రాయల చెరువు 33/11 కెవి సబ్ స్టేషన్ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి విద్యుత్ సరఫరా లపై వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఏపీఈఆర్సి ఛైర్మన్ రామ్సింగ్ ను ఎస్పీడీసీఎల్ అధికారులు ఘన స్వాగ తం పలికారు. ఈ క్రమంలో సిబ్బంది నిర్వహిస్తున్న పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు కు సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్ర నాయుడు, డిఈ దేవా ఆశీర్వాదం , ఏడీఈ శంకరయ్య, సబ్ ఇంజనీర్ దినేష్ చంద్రా రెడ్డి, ఎస్పీడీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: విద్యుత్ వినియోగదారులకు సకాలంలో విద్యుత్ సేవలను అందించాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపిఈఆర్సి) ఛైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ సూచించారు. స్థానిక తిరుపతి సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల విద్యుత్ శాఖాధికారులతో ఏపిఈఆర్సి ఛైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తూ వారి మన్ననలను పొందాలని సూచించారు. అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా ధ్యేయంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఈ సంస్థ పరిధిలో సబ్స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణను సకాలంలో పూర్తి చేసి, కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వరకుమార్, పీహెచ్ జానకిరామ్, ఎపిఇఆర్సి ఓఎస్డీ మునిశంకరయ్య, సూపరింటెండింగ్ ఇంజనీర్లు సురేంద్ర నాయుడు (తిరుపతి), ఇస్మాయిల్ (చిత్తూరు), సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు, ఏపీట్రాన్స్కో అధికారులు పాల్గొన్నారు.

రేపు 'పడమటి గాలి' నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశానికి రైతు ఆవశ్యకతను వివరించే అత్యంత ప్రజాదరణ కలిగిన 'పడమటి గాలి' నాటికను మహతి కళాక్షేత్రంలో ఈనెల 16వ తేదీ ప్రదర్శించనున్నారని తిరుపతి ప్రజలు, తిరుపతి పరిసరాల్లో ఉన్న రైతులు, కళాభిమానులు, రైతు సహాయకులు ఈ నాటిక ప్రదర్శనను చూసి విజయవంతం చేయాలని బీసీ సంఘర్షణ సమితి నాయకులు అక్కినపల్లి లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా 150కి పైగా ప్రదర్శనలు నిర్వహించి పడమటి గాలి నాటిక ప్రజాదరణను పొందిందన్నారు. సామాన్య రైతు కుటుంబం లో సాధక బాధలను ఈ నాటికలో కళ్లకు కట్టినట్టు కళాకారులు ప్రదర్శించను న్నారన్నారు. సమాజంలో ప్రతి మనిషి విజ్ఞానం సంపాదించుకోవాలని, రైతు ఆవశ్యకత సమాజానికి ఎంతో అవసరం అనే అంశాన్ని చక్కగా చూపను న్నారన్నారు. ఈ సమావేశంలో సాకం ప్రభాకర్, కట్టమంచి చంద్రబాబు, రమణ, కరాటే చంద్ర పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం..

శ్రీకాళహస్తి: కలిసికట్టుగా బాల్య వివాహాలను అరికడదామని 12వ జిల్లా జడ్జి శ్రీనివాసులు నాయక్ పిలుపునిచ్చారు. బాల్యవివాహాల వ్యతిరేక పోరాటాల సమితి ఆధ్వర్యంలో శనివారం జడ్జి శ్రీనివాసులు నాయక్ బాల్య వివాహాల నిర్మూలనా పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్య వివాహాలు సమస్య సమసిపోతేనే సమాజంలో మహిళా సాధికారత సాధ్యమవుతుందని జడ్జి తెలిపారు. ఇందుకు తమ వంతు ప్రయత్ని స్తున్న సమితి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యానాద సంఘం అధ్యక్షులు చందమామల కోటయ్య, జై భీమ్ ఆర్మీ వ్యవ స్థాపకులు పులి శ్రీకాంత్, లోకాదత్ సభ్యులు అడ్వకేట్ మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, వేణు, చెంచురామిరెడ్డి, ఈశ్వరయ్య, గంగయ్య పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి కుటుంబంలోనూ ఓ మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని, బ్యాంకుల కన్నా శ్రీనిధి సేవలే మిన్న అని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సిఇఒ వీరపాండ్యన్ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీనిధి 18వ సర్వసభ్య సమావేశంలో డిఆర్డిఎ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పీడీ శోభన్బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తిరుపతి జిల్లా శ్రీనిధి ప్రగతికి సంబంధించి వార్షిక నివేదికను వెల్లడించారు. శ్రీనిధి ద్వారా మహిళల అభ్యున్నతికి ఇస్తున్న రుణాలు, వారి అభివద్ధి, రుణాల రికవరీ తదితర అంశాలపై చర్చించారు. గూగుల్ మీట్ ద్వారా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరై ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసమే శ్రీనిధి ప్రాజెక్టును తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి కుటుంబంలో ఓ మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలన్నారు. కింద స్థాయిలో వి ఏ ఓ లు చేసే తప్పులు సంస్థకు చెడ్డ పేరు వస్తుందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేర్ప్ సీఈవో వీర పాండ్యన్ మాట్లాడుతూ శ్రీనిధి సేవలు అమోఘంగా ఉన్నాయని, బ్యాంకులు కన్నా శ్రీ నిధి సేవలే మిన్నగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ సమావేశంలో అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభావతి, శ్రీ నిధి ఏజి ఏం ఉన్నం హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL No-I AT TIRUVALLUR
M.C.O.P.NO.75 OF 2024

1. D.SYAMALA W/o.Dhanakumar,
2. N.AMARA W/o.N.Karuna
3. N.VANAJA W/o.N.Sivaiah
4. KUMAR S/o.Late.K.Samu ...**Petitioners**

V/s

1.P.ARUNA S/O.P.VENKATA CHALAM,
2.THE MANAGER, UNITED INDIA INSURANCE COMPANY LTD.,
...**Respondents**

To,
P.ARUNA S/O.P.VENKATA CHALAM, 5-152/A, NGO Colony, Puttur,Chittoor, Andhra Pradesh-517583 ...**1st Respondent**

NOTICE TO THE 1st RESPONDENT

Kindly take notice that a petitioner filed the above MCOP No.75/2024 as against 1st Respondent for claiming compensation. If you have any objection may appear in person or through pleader before the above court on 20-12-2024 at about 10.30 A.M. otherwise it will be decided ex-parte.

T.BHUVANESHWARI, B.A.,B.L.,
COUNSEL FOR PETITIONER

IN THE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) - CUM-J.F.C.M., SATHYAVEDU
O.S.No. 160/2024

BETWEEN
Konduru Ravikumar ...**Plaintiff**
AND
Aruru Damodhar Naidu ...**Defendant**

SUMMONS TO THE DEFENDANT

To
Aruru Damodhar Naidu S/o Late A. Chengalvaraya Naidu, Residing at Thondambattu village, Panduru Post, Varadaiahpallem Mandal, Tirupathi Dist.

Please take summons that, the plaintiff filed the suit fof recovery of debt basing on the promissory note in the above Hon'ble court against you and the above suit is posted to 09/01/2025 for your appearance. So, please to be attend on 09/01/2025 at 10-30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.

N.MURUGESHAN REDDY
ADVOCATE, PUTTUR

IN THE COURT OF CIVIL JUDGE (JUNIOR DIVISION) - CUM-J.F.C.M., SATHYAVEDU
O.S.No. 158 /2024

BETWEEN
Konduru Rajeswaramma ...**Plaintiff**
AND:-
Aruru Damodhar Naidu ...**Defendant**

SUMMONS TO THE DEFENDANT

To
Aruru Damodhar Naidu S/o Late A. Chengalvaraya Naidu, Residing at Thondambattu village, Panduru Post, Varadaiahpallem Mandal, Tirupathi Dist.

Please take summons that, the plaintiff filed the suit for recovery of debt basing on the promissory note in the above Hon'ble court against you and the above suit is posted to 09/01/2025 for your appearance. So, please to be attend on 09/01/2025 at 10-30 a.m. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.

N.MURUGESHAN REDDY
ADVOCATE, PUTTUR

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL No-I AT TIRUVALLUR
M.C.O.P.NO.85 OF 2024

1.BOMMALA SAKUNTHALA, W/O.LATE. GUNDLURU VENKATESH, No.4-55A, VTC:Bheemavaram, Bhimavaram (PO), Chandragiri (Sub District) Tirupathi District, Andra Pradesh-517102.
2.MINOR G.BHARATH, S/O. LATE. GUNDLURU VENKATESH, (Rep. by his Mother and Natural Guardian Bommala Sakunthala).
3.G.CHINNAKKA W/O.LATE.CHINNABBA, residing at Bayyareddygari Palli Village, Pulicherla Mandalam, Rayavaripalle, Kamavaram kothapet, Chittoor District, Andra Pradesh-517172 ... **Petitioners**

V/s

1.ASWATH ERAGALA S/O. E.MUTHYALAIAH (REGISTERED OWNER)
2.M.MANOHAR REDDY (INSURANCE POLICY HOLDER)
3.THE MANAGER, UNITED INDIA INSURANCE COMPANY LTD.,
...**Respondents**

To
M.MANOHAR REDDY (INSURANCE POLICY HOLDER) Chittoor, Tirupathi, Andhra Pradesh-517502 ...**2nd Respondent**

NOTICE TO THE 2nd RESPONDENT

Kindly take notice that a petitioner filed the above MCOP No.85/2024 as against 2nd Respondent for claiming compensation. If you have any objection may appear in person or through pleader before the above court on 03-01-2025 at about 10.30 A.M. otherwise it will be decided ex-parte.

T.BHUVANESHWARI, B.A.,B.L.,
COUNSEL FOR PETITIONER

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 04/2012

గోరంట్ల రాంబాబు వగైరా ...... వాదులు
Vs
పట్టేం గంగాధరరావు (డైడ్) వగైరా.... ప్రతివాదులు

NOTICE

D9) పట్టేం ఇందిర W/o లేటు గంగాధరరావు మాలవ్య నగర్, గూడూరు టౌన్, మరియు మండలం, తిరుపతి జిల్లా.

పై దావాలో నీకు ఇన్ని మార్లు నోటీసులు పంపించిన తీసుకొనక కాలయాపన చేయు చున్నందును ఈ పేపరు ప్రకటన ద్వారా నీకు నోటీసు జారీ నిమిత్తం వాయిదా 31-12-2024 తేదీకి వేసినారు. ఆరోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరబడి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్ష మందు దావా తీర్మానించబడును తెలియ పరచడమైనది.

వాయిదా తేది : 31-12-2024

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి :
తేది :14-12-2024

కరి రామకృష్ణారావు బి.ఏ.,ఎల్.ఎల్.బి
వాదుల తరపున అడ్వకేట్ అద్దంకి
Cell : 98492 35720